క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక


పార్టీ కండువా కప్పుతున్న చైర్మన్ సీతారాములు

నేలకొండపల్లి: మండలంలోని నాచేపల్లి గ్రామానికి చెందిన 20 కుటుంబాలు మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి శ్రీనివాసరెడ్డి చేస్తున్న అభివృద్ధి పనుల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు చైర్మన్ తెలిపారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, తమ్మినేని నవీన్, బొడ్డు బొందయ్య, ముంద్రా నాగప్రసాద్, రేగళ్ల రవి, గార్లపాటి లక్ష్మీనారాయణ, యాతాకుల శ్రీనాథ్, గట్టిగుండ్ల విజయ్, చిలకల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కలిసొచ్చే పార్టీలతో పొత్తుకు సిద్ధం

నేలకొండపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసొచ్చే పార్టీలతో పొత్తుకు సిద్ధమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నాటి భానుప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక కర్నాటి కృష్ణయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో ప్రజా సమస్యల కోసం పోరాడే వారికి ఎన్నుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కనకబండి సీతారాములు, మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, మల్లెబోయిన ఉపేందర్, అయోధ్య, రాయల మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

‘ట్రస్ట్’ సహకారం అభినందనీయం



చెక్కు అందిస్తున్న ఏసీపీ రమణమూర్తి

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఖమ్మం అసిస్టెంట్ కమిషనర్(ఏసీపీ) ఎస్వీ రమణమూర్తి అన్నారు. పరిశ సీతారత్నం ట్రస్ట్ ఆధ్వర్యాన దోర్నకల్‌కు చెందిన పేద విద్యార్థిని చెరుకుపల్లి విశాలికి రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ట్రస్ట్ సహకారంతో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థినికి ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య పుష్పవలి, స్వరూప, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మం గుట్టల బజార్ శ్రీ వాసవీ ఆలయంలో చాముండేశ్వరీ దేవిగా..


ఖమ్మం స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో..


ఖమ్మంగాంధీచౌక్: జమ్మిబండపై శ్రీదేవి అమ్మవారు


ఖమ్మంఅర్బన్: 12వ డివిజన్ రాధాకృష్ణనగర్‌లో..


రోటరీనగర్ రాజరాజేశ్వరీ ఆలయంలో..


ఖమ్మం : అభయ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో..

శ్రీ మహిషాసురమర్దినిగా అమ్మవారు

శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు శ్రీ మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా.. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించగా.. దాతలు ఆర్థిక సాయం అందించారు.

– సాక్షి నెట్‌వర్క్


నేలకొండపల్లి: అమ్మగూడెంలో అన్నదానం చేస్తున్న ఉత్సవ కమిటీ బాధ్యులు


ఖమ్మంఅర్బన్: 6వ డివిజన్‌లో హోమం చేస్తున్న కార్పొరేటర్ నాగండ్ల కోటి దంపతులు


ఖమ్మంఅర్బన్: యూపీహెచ్ కాలనీలో కుంకుమార్చన, హోమం పూజలు

శ్రీ మారెమ్మతల్లి ఆలయంలో..


మహిషాసురమర్దినిగా మారెమ్మతల్లి

ఖమ్మంరూరల్ : మండలంలోని రెడ్డిపల్లిలో కొలువుదీరిన శ్రీ మారెమ్మతల్లి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో అమ్మవారిని బుధవారం శ్రీ మహిషాసురమర్దినిగా అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో గణపతి పూజ, చండీహోమం, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. ఆ తర్వాత అన్నదానం చేశారు. కాగా, సాయంత్రం అమ్మవారికి పంచ, సప్త, నక్షత్ర, కుంభ హారతులు సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈఓ కె.జగన్‌మోహన్‌రావు, ప్రధానార్చకులు కాశావజ్జుల రామశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రవిబాబు

నేలకొండపల్లి: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని, పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి, జెడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.రవిబాబు అన్నారు. మండలంలోని కొత్తకొత్తూరు, నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెంలో ఎంపీటీసీ పోలింగ్ కేంద్రాలను బుధవారం పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కొత్తకొత్తూరులోని ప్రైవేట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించి పోలింగ్ బాక్స్‌లు, ఇతరత్రా మెటీరియల్ పంపిణీలో సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కోడ్‌ను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.యర్రయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘ఏలూరి’ జన్మదిన వేడుకలు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా బుధవారం టీఎన్జీవోస్, టీఎన్జీవోస్ జనరల్ ఆస్పత్రి విభాగం ఆధ్వర్యాన పెద్దాస్పత్రిలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం ఏలూరి శ్రీనివాసరెడ్డి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీటీఎస్ యూనియన్ బాధ్యులు శ్రీనివాసరావు, శ్రీనివాస్, జైపాల్, దుర్గా ప్రసాద్, లలిత కుమారి, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా రిజర్వేషన్లు


మాట్లాడుతున్న మాస్‌లైన్ నాయకురాలు ఝాన్సీ

రఘునాథపాలెం: తండాల్లో రిజర్వేషన్లు పూర్తిగా లంబాడీలకే కేటాయించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, రఘునాథపాలెం మండల కార్యదర్శి కేలోత్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బుధవారం రాంక్యాతండాలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన రిజర్వేషన్లు అనేక అనర్థాలకు దారి తీస్తున్నాయని విమర్శించారు. 99 శాతం ఎస్టీలు ఉన్న గ్రామాల్లో బీసీలకు రిజర్వేషన్ కేటాయించగా, బీసీలు ఉన్నచోట ఎస్టీలకు కేటాయించడం అన్యాయం చేశారని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండగా, దానిని పట్టించుకోకుండా కొత్త రిజర్వేషన్లు ప్రకటించడం వెనుక ఉద్దేశమేంటని ప్రశ్నించారు. లంబాడీల ఓటు బ్యాంక్ ఎక్కువగా ఉన్న సూర్యతండా, పుటానితండా, పరికలు, బోడు తండా, మంగయ్యతండా, ఎన్వీ బంజర వంటి ప్రాంతాల్లో బీసీ రిజర్వేషన్లు కేటాయించడం లంబాడీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమగ్రంగా పునరాలోచించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మేక రామనాథం, జరపలదేవుల ధరావత్ లక్ష్మణ్, కేలోతు పాపారావు, కూరాకుల నరసయ్య, కె.వెంకన్న, జాటోత్ ప్రేమ్‌సింగ్, పుప్పాల రామారావు, గోనగంటి వీరబాబు, షేక్ మదార్‌సాహెబ్, ఆడెపు సత్యం, లింగన్న, బోయిన నాగేశ్వరరావు, పీఓడబ్ల్యూ డివిజన్ నాయకురాలు స్వాతి, బి.లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఖమ్మం స్పోర్ట్స్: ఈనెల 12న నగరంలోని టీఎన్జీవోస్ భవన్‌లో జరగనున్న లాఫ్టర్ యోగా జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ సార్ పార్కులో నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ సదస్సుకు తెలంగాణ వైద్యుల సంఘం అధ్యక్షుడు ద్వారాకనాథ్‌రెడ్డి, దక్షిణ భారత సైక్రియాటిస్ట్ డాక్టర్ పి.కిషన్ హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.డీ.పాషా, వల్లూరి వెంకట్, ఎం.డీ.తాజ్‌వుద్దీన్, డాక్టర్ యు.భాస్కర్, జాన్‌ప్రసాద్, శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

పత్తి చేల పరిశీలన


కోక్యాతండాలో పత్తిచేనులో పరిశీలిస్తున్న ఏఓ

కూసుమంచి: మండలంలోని పలు గ్రామాల్లో పత్తి చేలను బుధవారం ఏఓ రామడుగు వాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పత్తిలో గులాబీ రంగు పురుగు ఉధృతి ఉన్నందున వాటి నివారణకు ఎకరానికి నాలుగు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని, తొలి దశలో 1500 పీపీఎం వేపనూనెను పిచికారీ చేసుకోవాలన్నారు. పత్తిలో ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు సస్య రక్షణ చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వంశీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.





సంక్షిప్తంగా..

కళాజాతా..

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యాన బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఖాతాదారులకు ఆర్థిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారుల బృందం బుర్రకథ రూపంలో గ్రామ ఖాతాదారులందరికీ పొదుపు ప్రాముఖ్యత, రుణాల సద్వినియోగం, డిజిటల్ లావాదేవీలపై ప్రదర్శనల రూపంలో ప్రజలకు వివరించారు. నాబార్డ్ డీడీఎం సుజీత్, ఎల్‌డీఎం రవి, రీజినల్ మేనేజర్ ప్రసన్నకుమార్, సీనియర్ మేనేజర్ ఆపరేషన్స్ కె.ప్రకాష్, బ్యాంక్ మేనేజర్ షేక్.మున్నా పాల్గొన్నారు.

పార్టీ అభ్యర్థుల గెలుపు అందరి బాధ్యత


సమావేశంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల, మార్కెట్, ఆత్మకమిటీ చైర్మన్లు

రఘునాథపాలెం: స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడమే ప్రతీ కార్యకర్త బాధ్యత అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక సంస్థల ఎన్నికలపై సన్నాహక సమావేశం నిర్వహించి పోటీ చేసే ఆశావహుల జాబితా, పార్టీ నిర్ణయాలు, అభ్యర్థి ఎంపికపై తదితర వాటిపై చర్చించారు. కాంగ్రెస్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అన్ని స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలని పువ్వాళ్ల పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన వెంకటేశ్వర్లు, రఘునాథపాలెం సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వాంకుడోతు దీపక్, దేవ్‌సింగ్, ధరావత్ రామ్మూర్తి, బాలాజీనాయక్, గుడిపుడి రామారావు పాల్గొన్నారు.

సన్మానం

ఖమ్మంమామిళ్లగూడెం: అఖిల భారత అసంఘటిత కార్మికుల ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసీ) జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సీహెచ్.విప్లవకుమార్ ఆధ్వర్యాన బుధవారం డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ దుర్గాప్రసాద్‌ను ఖమ్మం డీసీసీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పువ్వాళ్ల మాట్లాడుతూ.. అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేకేసీ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు సిద్దల నగేష్, నగర అధ్యక్షుడు జంగిపల్లి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పగిళ్లపల్లి రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ మెరుగు వెంకట్‌నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజు, నాయకులు డీమార్ట్ జానీ, తుపాకుల నాగేశ్వరరావు, బాబా, పుల్లారావు, రాంబాబు, సుధాకర్, బాబుసాహెబ్, శంకర్, వీరా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటమి ఖాయం

నేలకొండపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి ఖాయమని బీజేపీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 18 ఎంపీటీసీలు, జెడ్పీటీసీ స్థానాల్లో బీజేపీ పోటీచేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో మన్నె కృష్ణారావు, షర్ఫుద్దీన్, మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, మోహినుద్దీన్, సూరేపల్లి జ్ఞానరత్నం, కందరబోయిన వెంకటరమణ, కాళంగి వెంకటేశ్వర్లు, ఇస్లావత్ నాగేశ్వరరావు, కొండలు, వీరబాబు, రాధాకృష్ణ, హర్షవర్ధన్, నాగేశ్వరరావు, శేషగిరి, శ్రీనివాసరావు, రమేష్ పాల్గొన్నారు.

మాంసం దుకాణాలు, రెస్టారెంట్లు మూసివేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: అక్టోబర్ 2 మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా నగరంలోని మాంసం దుకాణాలు, కర్రీ పాయింట్లు, హోటళ్లు, డాబాలు, రెస్టారెంట్లు మూసివేయాలని, మాంసం విక్రయాలు జరపకూడదని కేఎంసీ అధికారులు నిర్వాహకులకు బుధవారం నోటీసులను జారీ చేశారు. గురువారం డ్రైడేగా పాటించాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే మున్సిపల్ చట్టం 2019 ప్రకారం చర్యలతో పాటు పెనాల్టీ విధించి దుకాణాలను మూసివేస్తామని హెచ్చరించారు.

మున్నూరుకాపులు ఐక్యంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న గుండాల కృష్ణ

ఖమ్మం మామిళ్లగూడెం: స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్నూరు కాపు కులస్తులు మిగతా బీసీ కులస్తులను కలుపుకుని ముందుకుసాగాలని మున్నూరు కాపు సంక్షేమ సంఘం నాయకుడు గుండాల కృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మంలోని ఆయన నివాసంలో సమావేశం నిర్వహించగా.. సంఘం 29, 30, 31, 35, 36 డివిజన్ల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మా ఓట్లు.. మాకే అనే నినాదంతో ఎన్నికల్లో మున్నూరు కాపు కులస్తులను గెలిపించుకోవాలన్నారు. బీసీ, మున్నూరు కాపు కులస్తులకు జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తా సీతారాములు, కనకం జనార్దన్, మెంతుల శ్రీశైలం, మలిశెట్టి వెంకటేశ్వర్లు, మూలగుండ్ల శ్రీహరి, పెళ్లూరి విజయ్‌కుమార్, అప్పారావు, శశిధర్, రేణుక, శోభారాణి పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల ప్రాంగణంలో మార్కింగ్ వద్దు


వ్యాపారులతో మాట్లాడుతున్న మెప్మా అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: వీధి వ్యాపారుల ప్రాంగణంలో కేఎంసీ అధికారులు దుకాణాల కేటాయింపు కోసం చేస్తున్న మార్కింగ్ ప్రక్రియవద్దనికొందరు వ్యాపారులు ఆందోళనకు దిగారు. మార్కింగ్ చేయడం ద్వారా తమకు అన్యాయం జరుగుతుందంటూ ఓ మహిళ వ్యాపారి ఒంటిపై పెట్రోల్ పోసుకోగా, మరో మహిళ పురుగు మందులో బెదిరింపులకు దిగింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి వారిని అడ్డుకున్నారు. ఆతర్వాత పోలీసులు, అధికారుల సమక్షంలో మెప్మా అధికారులు 210 దుకాణాలను ఏర్పాటు చేసేందుకు మార్కింగ్ చేశారు. ఒకరిద్దరు వ్యాపారులు మినహా మిగతావారంత సహకరించగా.. కావాలనే బయట వ్యక్తులు కొందరు వ్యాపారులను పక్కదారి పట్టిస్తున్నారని అధికారులు పేర్కొంటున్నారు.

